సుఖమొదుఃఖంబొపురుషుఁడు ♦ చూడవలయు,
ననుభవింపఁగవలయును ♦ నామెతోడ
ముక్కుబిగియించుకుండిన ♦ మూర్ఖుఁడగును ?

(వసంతుఁడు 1914)

# అప్పుడు, ఇప్పుడు.

అమ్మాయిలారా! మీరు ఏమనుకున్నా సరేగాని చూడగాచూడగా నాగరికం నేర్చిన యిప్పటి మీకాలంకన్న మా మూఢకాలమే బాగున్నదని నాకుతోస్తున్నది. ఏమంటారా, చెప్తానువినండి. నాకిప్పుడు అరవైయేండ్లు. నాకుఅయిదేండ్లకూనప్పుడే పెండ్లైంది. మాకాలంలో ఇప్పుడులాగానే పెండ్లికొమారులకోసరం కంచుకాకడాలువేసి వెతకడంలేదు. దగ్గరలో పిల్లవాడింతచిన్నవాడుగా, కొంచెం తెల్లకాగితంనల్లనజేసి బతికేవాడుగా, చూచి పిల్లనిచ్చేవారు. ఆప్రకారంగానె మా నాయనగారు మాఅక్కచెల్లెండ్రికందరికి పెళ్ళిచేశారు. మా ఆయనచాలామంచివారు. మేమిద్దరము చాలాఅన్యోన్యంగా వుండేవారము. నాయిష్టప్రకారంవారు, వారిష్టప్రకారం నేను నడుచుకొనేవారం. నేనుమావారివద్ద కొంచెముచదువుకూడా నేర్చుకున్నాను. ఈవార్తయేలాగొ ఊళ్లోపడ్డది. పలంనిమ్మెల్లమ్మ

మొగుడిదగ్గరచదువుకొంటున్నదని తలయెత్తకుండా ఆడవాళ్లు మొగవాళ్ళు ఎగతాళిచేశారు. ఏపనైనా బస్తీలలోచేస్తేతెలా ఉండదుగాని, పల్లెగ్రామాల్లో చాలకష్టం. ఏరవ్వంతలోపంవచ్చి నా నలుగురుపట్టిపీకుతారు. అలాగె నాచదువునుపట్టుకున్నారు. చదువులసరస్వతిఅన్నారు. సీమరాణిఅన్నారు. ఏవేవో అనేక నూతననామకరణాలుచేశారు. ఆడదిచదువుకుంటె మొగవాడి కర్థాయుస్సని కొందరుముసలమ్మలు బెదిరించారు. ఈసంగతులన్నీ మావారికిచెప్పాను. వాండ్లమాటనీకెందుకు? నీవుచదువుకుంటె నాఆయుష్యానికేమిలోపంలేదు అనివారన్నారు. మారుమాటాడకుండా నేచెప్పినట్టు చదువుకోమనిమందలించారు. సరేయని నేనెవరిమాటావినకుండా చదువుకున్నాను. నాకుచదువులో కొంచెమురుచిగల్గినతరువాత, ఆడపిల్లలకు పాఠశాలలు పెట్టిస్తే బాగుండుననుకున్నాను. నా కోరికయిప్పటికితీరింది. సంతోషమె. సుమారు నాకు నలభై యేళ్లువచ్చినానిక, మాఅబ్బాయిల చదువునిమిత్తం మేముగుంటూరుబస్తీ వెళ్ళినాము. అక్కడ ఒకప్లీడరుగారియింట్లో కాపురమున్నాము. వారియింటికిచాలా వార్తాపత్రికలువస్తూవుండేవి. వాటినన్నటిని నేనుచాలాశ్రద్ధగా చదువుతుండేదాన్ని. వానిలోనివ్రాతలుచూస్తే నాకుచాలా ఆనందంగాఉండేది. స్త్రీవిద్యాభివృద్ధినిగూర్చి సంఘసంస్కరణమునుగూర్చి పతితోద్ధరణనుగూర్చి తీవ్రమైనవ్రాతలు ఆపత్రిల్లోఉండేవి. ఆకాలంలో స్త్రీసంఘస్థితి చాలహైన్యంగాఉండేది.

మూర్ఖత్వానికి స్త్రీలు పుట్టినిండ్లుగా ఉండేవారు. వితంతువుల నిర్బంధనలు, కోడండ్ల కోడంట్రికములు చాలా యెక్కువగా ఉండేవి. దానికితోడు భోగంవాండ్లు ఉచ్ఛస్థితితో ఉండి పురుషుల మన్ననలకుపాత్రులై పతివ్రతలకొంపలు కూలుస్తుండేవారు. ఈతీరుచూచి దేశమెప్పుడు బాగుపడునని విచారిస్తూండేదానను. వార్తాపత్రికల్లోని వ్యాసాలుచూచినానక నాకుచాలాధైర్య వచ్చింది. మగవాండ్లు ఇంగ్లీషుచదివి మతిమంతులౌతున్నారు. ఆడవాండ్లవిద్యాభివృద్ధికిపాటుపడుతున్నారు. ఇకపరవాలేదు అనుకున్నాను. కొన్నాళ్ళల్లో స్త్రీసంఘము ఉన్నతస్థితికివస్తుంది, ఆంధ్రస్త్రీలఅగచాట్లుఅడుగంటి చదువుసౌఖ్యం స్వాతంత్రపాలన పడుతారనుకున్నాను. అత్తలకోడంట్రికం కూలిపోతుందనుకున్నాను. అయితేఅదేమిప్రారబ్ధమోగాని నాయూహఒక్కటైనా పూర్తిగాజరగలేదు.

ఇంతలో ఆకస్మికంగా మబ్బులేనిపిడుగులాగా వరకట్నాలొకటివచ్చిపడ్డాయి. వచ్చేరావడంతోటే వానిచురుకేమోగాని ఇన్ఫ్లూయింజా జ్వరములాగే దేశమంతటా నిముషంలోవ్యాపించినాయి. అంతటితో నాఆశఅడుగంటింది. ఆంధ్రస్త్రీలఅభివృద్ధి ఉత్తదేఅని తోచింది.

మాకాలంలో ఈమితిమీరిన వరకట్నాలులేవు. ఊరకే పిల్లనిచ్చి పెండ్లిచేస్తేనేచాలాగొప్ప. దానికితోడు పిల్లలకుచేతులకునాలుగుగోట్లుచేయించి కాళ్ళకుకడియాలుచేయించి ముక్కు

కు రెండుముక్కు పుడకలు బెట్టి చెవ్వుకు కాస్త మెరుగుబిళ్ళలు చేయించి నడుముకోక వెండివడ్డాణం తగిలిస్తే పెండ్లికొమారుడికి ఒకపట్టుపంచలజత ఒకకంచెంబిస్తే ఓహోహో భాగ్యవంతుల పెండ్లిలని ఊరూర చెప్పకొనేవారు. అలాంటిది ఇప్పుడువెన్ని వేలుయిచ్చినా తృప్తి లేదు. వెండిచెంబులిచ్చినా తృప్తి లేదు. నానాటికి వివాహాములు హద్దుమీరిపోయినాయి. నీతినియమములుపోయినాయి. మాటనియమము లేదు. పండ్లు పసుపు (తాంబూలంపుచ్చుకొనినిశ్చయించుట) నియమము లేదు. కట్నంబజానాపుచ్చుకున్నా సరే, లగ్నం నిశ్చయము చేసుకున్నా సరే. ఎవరైనామరివందరూపాయలిస్తామంటే నిశ్చయించుకున్నసంబంధంనీళ్లగలుపుతె. రామరామ! ఏమిఈఅన్యాయం! ఆంధ్రదేశం ఇంతఅధోగతికివచ్చిందేమి? సంస్కరణసభలు ఎక్కువకావడం వల్లనా? ఈకట్నాలమూలంగా ఆడపిల్లలఅభివృద్ధి ఆగిపోయింది. ఆడపిల్లపుట్టిందంటె అశుభంగా తల్లిదండ్రులు అనుకుంటున్నారు. పెళ్ళిళ్లుచేస్తుమాని విచారిస్తున్నారు. పాపం, కన్యలకుకూడా యిందుమూలకంగా సంతోషం లేదు. తాముపుట్టంగానే యింట్లో తల్లిదండ్రులు తగ్గినముగ్గినచూచి మాపుట్టుక తల్లిదండ్రులకు ఆనందకారణం కాకపోయె నేయని వారికికన్యకాలంలోనె మనసులోవిచారం. తరువాత ఏలాగోలాగు పెండ్లైఅత్తవారింటికిబోతె వారిపోరు అడుగనెలక్కర్లేదు. మీవాండ్లు నావిద్యకు తగినకట్నమియ్య లేదని మొగుడిపోరూ. మాకులాంఛ

నాలు చక్కగా జరుగలేదని అల్లలాడుచుండిపోతూ. ఓయి బాబో ఎల్లకాలం కట్నములేతిరుగాఉంటే పిల్లలుడుగంటిపోరూ. ఇంకేంవుంది. మాకాలంలో ఆడపిల్లలనుగన్న దరిద్రులెవరన్నా ఉంటే ఏముసలికో ముదక్కో పిల్లలకు అమ్ముకునేవారు. అంతే గాని ఈమాదిరిగా బేరంపెట్టి, మగపిల్లలను, పరువుగలవారు మర్యాదస్థులు, ధనవంతులు, బాహాటంగా, అమ్ముకోటంయె రగం. ఆత్మగౌరవంగల విద్యార్థులు ఈఅమ్ముడుబోవటానికి యెలాహర్షిస్తున్నారో తెలియదు. అదేమంటే, మాఅమ్మఒప్పగో లేదని పెండ్లికొడుకునూ, ఆడవాళ్లుఒప్పగోలేదని ఇంటియజమాని, మెల్లగా ఆడువారిమీఁద నెట్టేస్తారు. అటుయిటుతిరిగి ఈఅపవాదంగూడా పిట్టపిడుగులాగా ఆడవాళ్ళనెత్తినేబడ్డది. ఆత్మగౌరవంగల ఆడదానికి యింతకన్నా నవమానమేమికావలె? దేవతా కాలమునుంచిగూడ మనవాళ్ళుచేసినపాపము ఆడవారినెత్తిని పోయడము అలవాటైపోయింది. దేవేంద్రునివంటి దిక్పాలకుడు తాజేసిన బ్రహ్మహత్యాపాతకము ఆడవాళ్ళకు పంచాడట. చూచారా, అన్యాయము?

సోదరీమణులారా! ఇంకాయెన్నాళ్ళు ఈఅపఖ్యాతి భరిస్తారు? మీఅబ్బాయిల వివాహాల్లో కట్నాలులేకుండా వివాహాలు చేసి ఈఅపఖ్యాతిబాపుకోరాదూ? డబ్బేమిశాశ్వతము? ఈవరశుల్కం తీసుకుపోతే మనమేమిఅన్నముతినడము లేదా? మనఅబ్బాయిలకు చదువుచెప్పించుకోడము లేదా? ఆడవాళ్లము

అందరము ఒకటే. ఒకరు కష్టపడితే ఒకరికి గాదూ? ఆమాత్రము జాతీయాభిమానము లేక డబ్బు ముఖము చూచుకుంటె యేలాగు? ఇవ్వాళ కొడుకుల పెండ్లిండ్లు, రేపు కూతుళ్ళ పెండ్లిండ్లు ఒకనాటి సంతోషము యేమిటి, ఒకనాటి కష్టము యేమిటి? యెల్లకాలము జరిగేది చూచుకోవాలి. ఈ మాయ కట్నాలువల్ల మనకు యెక్కువ జరిగేదేమి లేదు. కన్యాదాతలకు మనస్సంకటములో, భగా జరగవలసిన పెండ్లిళ్లల్లో తగాదాలు, అన్యోన్యంగా ఉండవలసిన వియ్యములో విరోధాలు. అన్నిటికన్నా ముఖ్యమైన నష్టము యేమిటంటే ధనమే ముఖ్యముగా చూచుకోవడము చేత వధువునకు తగినవరుఁడు వరునకు తగినవధువు దొరకక శాశ్వతదుఃఖమనుభవించుట. ఇకయింతకన్న అపకారమేమి కావలెను? కనుక సోదరీమణులారా! ముసలిదాని మాటలని పెడచెవిని బెట్టకుండా నామాటవిని కట్నాలకాశపడి కురూపికోడండ్లను తెచ్చుకోకుండా, కలకాలము కొడుకుచేత సాధింపుపడకుండా మంచికోడళ్ళి తెచ్చుకొని సుఖించండి. కట్నాలు నిషేధించి అపవాద బాపుకోండి. స్త్రీలోకానికి ఇదివరకువచ్చిన నీలాపనిందలు చాలును. ఇంకా యెందుకు మీ నెత్తిని బెట్టుకుంటారు? ఆ నామాట వినండి. పెద్దవారి మాట పెరుగన్న మాట తెలుసునా? అమ్మాయిలారా! ఈపాటికి సెలవుపుచ్చుకుంటాను. చేతగాని ఈ ముసలిదాని మాటల్లో తప్పులుంటే తోసేసి మంచిమాట యేరుకోండి. ఈ కట్నాల్లరి చూచే నేను గతకాలము మంచిదన్నాను. నిజమా? అబద్ధమా?

వృద్ధురాలు.